

# అనుబంధం

"నన్నెవరన్నా చూడటానికి వస్తే దవడ పగలకొడతాను" అంది జానకి ఒకరోజున. రాఘవయ్య నవ్వి ఊరుకున్నాడు.

"నిజంగానే అంటున్నాను" అంటూ రెట్టించింది జానకి.

"నీ ఇష్టం... నువ్వు కావాలనుకున్నప్పుడే పెళ్ళిచేసుకుందువుగానీ.... సరేనా..." అన్నాడు రాఘవయ్య.

"నేనసలు పెళ్ళి చేసుకోను..." అంది జానకి.

"పోనీ వద్దులే..." అన్నాడు రాఘవయ్య. జానకికి చిరుకోపం వచ్చింది. రాఘవయ్య తనను ఎగతాళి చేస్తున్నట్లుగా గ్రహించింది.

"ఫో... నాన్నా..." అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయింది.

రాఘవయ్య అక్కడే ఆరుబయట పత్రిక చదువుకుంటూ కూర్చున్నాడు. జానకి లోపలకు వెళ్ళిందే గాని ప్రాణమంతా ఆరుబయటే ఉంది. తండ్రితో కొన్ని విషయాలు చెప్పాలనీ, తన మనసులో ఉన్న ఆవేదనంతా బయటపెట్టాలనీ ఉంది. తనేదన్నా అన్నప్పుడు తండ్రి వాదించవచ్చు, తన మాటలోనే ఎక్కువ నిజం ఉన్నట్లు నిరూపించవచ్చు. రాఘవయ్య ప్రతిదానికి 'సరేలే' అంటుంటే తనేం చేయగలుగుతుంది? బుంగమూతి పెట్టుకుని తండ్రి ఎదురుగుండా కుర్చీలో కూర్చుంది. రాఘవయ్య మెల్లిగా పత్రిక మడిచి అరుగుమీద పడేసి, ఒళ్ళు విరుచుకుని

కళ్ళజోడు తీసి చొక్కాతో తుడిచి మళ్ళీ పెట్టుకుని జానకివంక తిరిగాడు "నువ్వు చెప్పదలచుకుందేమిటో చెప్పేసెయ్యి" అన్నట్లు.

"నిన్న సావిత్రి వాళ్ళింట్లో ఏమయిందో తెలుసా?..." అంది జానకి.

"ఎక్కడా నువ్వు చెప్పందేనా...?" అన్నాడు రాఘవయ్య.

"నీకేవీ తెలియనట్లు మాట్లాడుతావు... సంబంధం చూడటానికని వాళ్లు రాలేదూ..."

"అవును వచ్చారు..."

"వాళ్ళ సంగతే చెప్పేది... నీకు సంగీతం వచ్చా, బొమ్మలు గీయటం వచ్చా అంటూ అడ్డమైన ప్రశ్నలూ వేసేటప్పటికి సావిత్రి నాలుగూ ఝాడించి వదిలి పెట్టింది...!"

"భలే... అట్లా ఉండాలి..."

"నిజంగా నాన్నా... ఆ అబ్బాయికేమో చదువురాదు, సంగీతం రాదు... ఇనప్పెట్టెలో డబ్బుందిట... అంతే...!"

"డబ్బుంటే చాలదుటమ్మా... సంగీతం కొనుక్కోవచ్చు, బొమ్మలు కొనుక్కోవచ్చు..."

"అంతటితో ఊరుకుంటే ఫరవాలా... మనుషుల్ని గూడా కొనుక్కుందామను కుంటున్నాడు."

"సరేలే... అయినా నిన్ను చూడటానికి రాలేదుగా... నీకెందుకు అక్కసు..."

"ఇవ్వాళ సావిత్రికయింది అవమానం... రేపు నాకవుతుంది..."

"నిన్ను చూడటానికి వస్తే దవడ పగలగొడతానంటున్నావుగా!"

"ఛో... నాన్నా... నీకంతా ఎగతాళిగా ఉంది..."

"ఎగతాళిగాదమ్మా... చదువు, సంగీతం వచ్చో, రాదో కనుక్కోకుండా పెళ్ళి ఎట్లా చేసుకుంటారు... కాబోయే భార్య కథాకమామీషూ తెలుసుకోవద్దూ..."

"ఆ తెలుసుకోవద్దూ... తనేమో పెద్ద పండితుడయినట్లు కాబోయే భార్య పెద్ద సంగీతవిద్వాంసురాలు కావాలిట..."

"సంగీతం అంటే అభిరుచేమో అతనికి... అందుకు ఆయన పండితుడు కావటం దేనికి జానకీ..."

"మనిషిని అట్లా పరీక్ష చేస్తుంటే చదువుకున్నదానికి అవమానంగా ఉండదూ... సావిత్రి నిన్నల్లా ఏడుస్తూనే ఉంది..."

"బావుంది... ఇదేమన్నా ఆఫీసు ఉద్యోగమా? డిగ్రీ సర్టిఫికేటు చూసి ఆర్డరు వేసెయ్యటానికి"

"నువ్వెప్పుడూ ఇంతే నాన్నా... ప్రతిమాటకీ ఏదో ఒకటి చెబుతావు... నేనయితే అసలు పెళ్ళి చేసుకోను..."

రాఘవయ్య జానకి మాటలు వినిపించుకోకుండానే లేచేటప్పటికి, జానకి వాకిలివైపు తిరిగి చూసింది. గుర్రబ్బండి ఆగివుంది. అందులోనుంచి దిగిన వ్యక్తి చేతిసంచీ పట్టుకుని మెల్లిగా గేటుదాకా వచ్చి "రాఘవయ్యగారిల్లిదేనాండీ..." అంటూ అడుగుతున్నాడు.

"ఆ ... రా నాయనా..." అంటూ రాఘవయ్య అతన్ని లోపలకు ఆహ్వానించాడు.

"నా పేరు రామారావు... వెంకట్రామయ్యగారి అబ్బాయిని..." అన్నాడు అతను.

"ఓహో... నువ్వటోయి..." అంటూ రాఘవయ్య చనువుగా దగ్గరకు వెళ్ళి భుజాన చెయ్యి వేసి లోపలకు తీసుకుని వస్తూ "ఇంట్లో అంతా కులాసానా... మీ నాన్న బాగా తిరగలేకపోతున్నాడట...పెద్దతనం... మీ అమ్మగారు ఎట్లా ఉంటున్నారు. కులాసానే గదా..."

అంటూ కుశలప్రశ్నలు వేశాడు. జానకి అక్కడే నిలబడి ఉంది.

"మా అమ్మాయి జానకి..." అంటూ జానకిని చూపించి "వీళ్ళ నాన్నా, నేనూ ప్రాణస్నేహితులం అమ్మా..." అంటూ రామారావును పరిచయం చేశాడు.

"నమస్తే..." అంది జానకి. రామారావు ప్రతి నమస్కారం చేశాడు.

"కాళ్ళు కడుక్కోవటానికి నీళ్ళు తీసుకురామ్మా..." అంటూ జానకిని పురమాయించాడు రాఘవయ్య.

అప్పుడే చీకటిపడింది. వీధిదీపాలు వెలిగించారు. రామారావు బట్టలు మార్చుకోవటానికి వెళ్ళాడు.

"నువ్వు వెళ్ళి మాంచి కాఫీ చేసి తీసుకురావాలి" అన్నాడు రాఘవయ్య.

జానకి అయిదు నిమిషాల్లో కాఫీ చేసి తెచ్చింది. రామారావు కాఫీ త్రాగి "చాలా బావుంది..." అన్నాడు.

"థ్యాంక్స్..." అంది జానకి.

"ఈ కాఫీ మా అమ్మాయి చేసింది" అన్నాడు రాఘవయ్య.

రామారావు నవ్వి ఊరుకున్నాడు.

"మా ఇల్లు చూద్దువుగాని రా." అంటూ రాఘవయ్య రామారావుని వెంట తీసుకుని వెళ్ళాడు. జానకి కూడా తండ్రితోబాటే ఉంది. ఇల్లంతా తిప్పి "ఇదీ మా ఇల్లు" అన్నాడు.

"చాలా బావుంది..." అన్నాడు రామారావు.

"ప్రయాణపు బడలికతో ఉన్నట్లున్నావు... అన్నం తిని పడుకో. పగలు అంతా వివరంగా చూద్దువుగాని" అన్నాడు రాఘవయ్య.

రామారావు నిద్రలేచేటప్పటికి ఏడుగంటలయింది. ముఖం కడుక్కుని వరండా గదిలోకి వచ్చేటప్పటికి కాఫీ తయారుగా ఉంది.

"కాఫీ ఎట్లా ఉంది...?" అని ఈ పూట ఎవరూ అడగలేదు. రామారావు కల్పించుకుని "మీ అమ్మాయికి కాఫీ చేయటమేనా... వంట చెయ్యటం కూడా చేతనవునా..." అన్నాడు నవ్వుతూ. జానకి మాట్లాడలేదు.

"ఈ పూట వంట నువ్వు చెయ్యమ్మా..." అన్నాడు రాఘవయ్య జానకి నుద్దేశిస్తూ.

"అట్లాగే..." అంది జానకి.

"కాఫీ చాలా బాగుంది..." అన్నాడు రామారావు. జానకి మాట్లాడలేదు.

"ఇది నీ ఇల్లుగా భావించుకుని రెండురోజులపాటుండాలి..." అన్నాడు రాఘవయ్య రామారావుతో.

"అబ్బే రెండు రోజులెక్కడండీ... ఈ రాత్రికి వెళ్ళిపోతాను..." అన్నాడు రామారావు.

"అంత తొందరేముందోయ్..."

"అక్కడ కాలేజీ తెరుస్తారండీ... రేపు పొద్దున అక్కడ ఉండాలి... తప్పదు మరి... మీరు క్షమించాలి..." అన్నాడు రామారావు.

రాఘవయ్యకు ఏం చెప్పటానికీ తోచలేదు.

"సరే చూద్దాంలే..." అన్నాడు.

"మీరేం చదువుతున్నారు..." అంటూ సూటిగా జానకిని ప్రశ్నించాడు రామారావు.

"బి.ఏ. చదువుతున్నాను..."

"సాహిత్యం అంటే మీకు అభినివేశం ఉందా?"

"అంటే...?"

"అంటే మీరు నవలలు, కావ్యాలూ చదువుతూ ఉంటారా?"

"ఎప్పుడన్నా చదువుతుంటాను. నాకు శరత్ నవలలంటే ఇష్టం..." అంది జానకి.

"మీరూ... నా మాదిరే అన్నమాట... ఇంకో మాట అడగమంటారా...?"

"సాహిత్యం సంగతి మటుకు నేనడగమంటేనే అడిగారా... మీరడగదలచుకున్నవి అడగండి..." అంది జానకి.

"మీకు సంగీతంలో ప్రవేశం ఉందా...?"

రాఘవయ్య కల్పించుకుని "సంగీతం అంటే జానకికి ఒకటే పిచ్చి రామారావు... ఆ వీణ పట్టుకుని కూర్చోమంటే... అన్నం నీళ్ళు అక్కర్లేదు..." అన్నాడు.

"ఇంకేం అలా అయితే... మీరు తప్పకుండా ఒక పాట వినిపించాలి" అన్నాడు. జానకి వీణమీద వాయిస్తూ రెండు పాటలు పాడింది.

"ఇలా పాడుతూ కూర్చుంటే వంట చెయ్యద్దా" అన్నాడు రాఘవయ్య.

"వీణ పట్టుకుని కూర్చుంటే అన్నం, నీళ్ళు అక్కర్లేదన్నారు గదా..!" అన్నాడు రామారావు. జానకి ముసి ముసి నవ్వులు నవ్వింది. రాఘవయ్య పగలబడి నవ్వాడు. "గట్టివాడివే..." అన్నాడు. జానకి వంట ప్రయత్నంలోకి వెళ్ళింది.

"ఎట్లా ఉంది వంట...?" అన్నాడు రాఘవయ్య భోజనాల ముందర.

"బ్రహ్మాండంగా ఉంది..." అన్నాడు రామారావు.

రామారావు ఆ సాయంత్రం బండికే బయలుదేరాడు. వీధిగుమ్మందాకా అంతా సాగనంపటానికి వెళ్ళారు. జానకికి దొడ్లో మధ్యాహ్నం ఎదురుదెబ్బ తగిలింది. కొంచెం కుంటుతూ వచ్చింది.

"అట్లా కుంటుతున్నారేమిటి? ఒక కాలు పొట్టి కాదు గదా..." అన్నాడు రామారావు.

"ఎదురుదెబ్బ తగిలింది..." అంది జానకి.

"సరే... మళ్ళీ వస్తానండి..." అంటూ అందరికీ నమస్కరించి బండి ఎక్కాడు రామారావు.

రాఘవయ్య మెల్లిగా లోపలకు వస్తూ "చాలా యోగ్యుడు... మా స్నేహితుడి అదృష్టం..." అన్నాడు. జానకి మాట్లాడలేదు. లోపలకు పోబోతుంటే ఇంతలోకి జానకి స్నేహితురాలు సావిత్రి వచ్చింది. వస్తూనే జానకి భుజంమీద చెయ్యివేసి "దవడ పగలగొట్టలేదేం...?" అని అడిగింది.

"ఎవరిని?"

"ఆయన్నే... నిన్ను చూడటానికి వచ్చినాయన్ని..." అంది సావిత్రి. జానకి నిర్ఘాంతపోయింది.

"నన్ను చూడటానికి వచ్చాడా...?" అంటూ తెల్లబోయింది. గబుక్కున రెండడుగులు వాకిట్లోకి వేసి పోతున్న బండివంక చూసింది. రామారావు బండిలోనుంచే చేయి ఊపాడు. జానకికి అప్పుడు అతని దవడ పగలగొట్టాలని అనిపించలేదు. "ఆయన్ని సరిగ్గా చూడలేదే!" అనుకుంది.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక)